# రైతులకు 'ఎత్తిపోతల' అండ

- మిగతా వాటికి ఆదర్శంగా కన్కపూర్ ఎత్తిపోతల పథకం కమిటీ
- రెండు వేల ఎకరాలకు సాగునీరు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు
- మూడు నెలలకోసారి కమిటీ సమావేశం



అబ్దుల్లాపూర్‌లో పంటలకు అందుతున్న నీరు



కన్కపూర్ ఎత్తిపోతల పథకం

**లోకేశ్వరం:** గోదావరి నీటిని మెట్ట పొలాలకు అందించి.. బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు మండలంలోని కన్కపూర్‌లో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం సత్ఫలితాలనిస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్సార్ హయాంలో నిర్మించిన కన్కపూర్ ఎత్తిపోతల పథకం మోడల్‌గా గుర్తింపు పొంది జిల్లాలోని మిగతా వాటికి ఆదర్శంగా నిలుస్తోంది. అధికారులు.. గత నెలలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు ప్రత్యేక సందర్శనలో భాగంగా కన్కపూర్ తీసుకొచ్చి కమిటీ పనితీరు వివరించారు. ఈ ఎత్తిపోతల పథకం ప్రయోజనాలను తమ ప్రాంతాల్లోని రైతులకు వివరించి చైతన్యపర్చాలని అవగాహన కల్పించారు.

**2009లో..**

మండలంలోని కన్కపూర్, అబ్దుల్లాపూర్, జోహర్‌పూర్, అర్లి, గొడిసెరా, రాయపూర్‌కాండ్లీ, రాజేశ్‌తండా, చింతకుంటతండా గ్రామాల్లోని 4780 ఎకరాలకు సాగు నీరందించాలనే ఉద్దేశంతో 2009లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.22.55 కోట్లతో ఈ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. రెండు ప్రధాన డీసీలు, 170 సబ్ డీసీలను నిర్మించారు. పథకం నిర్మాణ పనులు పూర్తికాగానే బ్రహ్మేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌గా నమోదు చేసుకున్న కమిటీకి నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఈ పథకం ద్వారా రెండు పంటలకు సాగునీరు అందిస్తున్నారు.

**ఎకరాకు రూ.1200 వసూలు..**

ఈఎత్తిపోతల పథకంతో సాగు నీరు అందడంతో ఎనిమిదేళ్లుగా పంటలు పండిస్తూ ఆర్థికాభివృద్ధి చెందుతున్నామని మండలంలోని ఆయా గ్రామాల రైతులు పేర్కొంటున్నారు. ఎకరాకు రూ.1200లను నీటి తీరు కింద వసూలు చేస్తున్నట్లు ఎత్తిపోతల పథకం చైర్మన్ కట్ట నరేందర్‌రెడ్డి తెలిపారు.

**పథకం లావాదేవీలు...**

ఈ పథకం ద్వారా నీటిని వినియోగించుకున్నందుకు రైతులు చెల్లించే సొమ్ముతో కమిటీ సభ్యులు దీని నిర్వహణ చూసుకుంటున్నారు. పంపుల ఆపరేటింగ్, నీటి తడులు ఇచ్చేందుకు నలుగురు ఆపరేటర్లు, నలుగురు నీటి తడులిచ్చేవారు, ఇద్దరు వాచ్‌మెన్‌లను నియమించుకున్నారు. వారికి ప్రతి నెలా వేతనం కింద రూ.లక్ష, కార్యాలయం ఖర్చు కింద రూ.రెండు వేలు, లిఫ్ట్ మరమ్మతుల కోసం సంవత్సరానికి రూ.2.50 లక్షలను ఖర్చు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

**మూడు నెలలకోసారి సమావేశాలు..**

కన్కపూర్ ఎత్తిపోతల పథకం కమిటీలో ఆరుగురు డైరెక్టర్లు ఉండగా.. మూడు నెలలకోసారి సమావేశం నిర్వహించి చేపట్టే అంశాలను తీర్మానం చేస్తున్నట్లు కమిటీ చైర్మన్ కట్ట నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. అధికారుల సూచనలు మేరకు ఎత్తిపోతల పథకం అభివృద్ధిలో నడుస్తుంది. పూర్తిస్థాయిలో పైప్‌లైన్ పనులు కాకపోవడంతో వర్షాకాలంలో (ఖరీఫ్)లో 2200 యాసంగిలో 1800 ఎకరాలకు నీరందిస్తున్నట్లు చైర్మన్ పేర్కొన్నారు.

### రెండు పంటలకు నీరు



ఎత్తిపోతల పథకం ద్వారా నీరందడంతో ఖరీఫ్, యాసంగిలో వరి పండిస్తున్నాం. గుట్ట మీద ఉన్న మా భూములకు నీరందడంతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాం. కానీ పలుచోట్ల ఏర్పడిన పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు చేయిస్తే రైతులకు మరింత మేలు కల్గుతుంది. –మహేందర్‌రెడ్డి, అబ్దుల్లాపూర్

### రికార్డులు నిర్వహిస్తున్నాం



ఎత్తిపోతల పథకం ద్వారా ఎన్ని ఎకరాలకు నీరు అందుతుందో వివరాలను నమోదు చేస్తున్నాం. మా కమిటీ ఆధ్వర్యంలో క్యాష్‌బుక్, రశీదుబుక్, ఆదాయ, వ్యయం వివరాలను రికార్డుల్లో పొందుపరుస్తున్నాం. మూడు నెలలకోసారి సమావేశం ఏర్పాటు చేసుకొని సమస్యలను చర్చించుకుంటున్నారు. రైతులు, అధికారులు సహకరిస్తే మరిన్ని ఎకరాలకు నీటిని అందించవచ్చు.

– కట్ట నరేందర్‌రెడ్డి, కన్కపూర్ ఎత్తిపోతల పథకం చైర్మన్

### మరమ్మతులు చేపడుతాం

కన్కపూర్ ఎత్తిపోతల పథకం కింద నాలుగు వేల ఎకరాలకు సాగునీరు అందించాలి. కానీ ప్రస్తుతం రెండు వేల ఎకరాలకు మాత్రమే సాగు నీరు అందుతుంది. పైప్‌లైన్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేసి లీకేజీలకు మరమ్మతులు చేపట్టి పూర్తిస్థాయిలో నీరందేలా చూస్తాం.

– అనిల్, టీఎస్ ఐడీసీ డీఈ

పైపులైన్ నిర్మాణ పనులు పూర్తి చేసి మరిన్ని ఎకరాలకు సాగునీరు అందించాలని రైతులు వేడుకుంటున్నారు.

## క్లుప్తంగా

### సీఎం సభకు వెళ్లిన మహిళలు



కుభీర్ నుంచి వెళ్తున్న మహిళలు

**కుభీర్:** మండలంలోని వివిధ గ్రామాల స్వయం సహాయక సంఘాల సభ్యులు మంగళవారం కుభీర్ నుంచి బస్సులో మేడ్చల్‌లో జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి సభకు తరలివెళ్లారు. ఏపీఎంలు సృజన్‌రెడ్డి, లక్ష్మణ్, సీఏలు తదితరులు ఉన్నారు.

### భీమాబాయి వర్ధంతి

**భైంసాటౌన్:** పట్టణంలోని రాహుల్‌నగర్, ఏపీ నగర్ మైత్రేయ బుద్ధవిహార్‌లో మంగళవారం రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ మాతృమూర్తి భీమాబాయి వర్ధంతి నిర్వహించారు. బుద్ధిస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఎస్ఐ భైంసా అధ్యక్షులు ప్రసంజీత్ హేమ్లే, దమ్మానంద్, రాందాస్ వాగ్మారే, అనిత గైక్వాడ్, ఏక్‌నాథ్ బిరదే, బౌద్ధ ఉపాసిక, ఉపాసకులు, తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగులకు ఫిజియోథెరపీ



వైద్య పరీక్ష చేస్తున్న శ్రీనివాస్

**తానూరు:** మండలకేంద్రంలోని భవిత విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం దివ్యాంగులైన విద్యార్థులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. 24 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు ఫిజియోథెరపిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. ప్రతి మంగళవారం భవిత విద్యా వనరుల కేంద్రంలో నిర్వహించే వైద్య శిబిరాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐఆర్‌టీ భూమన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

### అక్రమంగా ఇసుక తరలించొద్దు

**ఖానాపూర్:** అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎర్వచింతల్ పంచాయతీ కార్యదర్శి హనుమంతు అన్నారు. బుధవారం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే ట్రాక్టర్‌కు రూ.5 వేల జరిమానా, లారీకి రూ.25 వేల జరిమానా చెల్లించాలన్నారు. పొక్లెయినర్‌తో ఇసుక తవ్వకాలు జరిపితే రూ.50 వేల జరిమానా ఉంటుందన్నారు. ఇసుక కావాలిసిన వారు ట్రాక్టర్‌కు రూ.800 చెల్లించి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ వాల్‌సింగ్ పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రం పరిశీలన



మాట్లాడుతున్న తహసీల్దార్ మల్లేశ్

**సోన్:** లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం మండలంలోని సిద్దులకుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ మల్లేశ్ పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు హరీశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

### 'నివారణ చర్యలు చేపట్టాలి'

**ఖానాపూర్:** కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన కరోనా వ్యాక్సిన్లు ప్రజలకు ప్రాణాంతకంగా మారుతున్నాయని ఎంసీపీఐయూ జిల్లా సహాయ కార్యదర్శులు పీటర్, సురేందర్ ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనంలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. మృతి చెందిన వారికి రూ.10లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. సమావేశంలో స్వరూప, సంధ్య తదితరులు ఉన్నారు.

### విగ్రహం ఏర్పాటుకు అనుమతించాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

**దస్తురాబాద్:** మండల కేంద్రంలో హనుమాన్ విగ్రహం ఏర్పాటుకు అనుమతి మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శివారులో విగ్రహం ప్రతిష్ఠించే స్థలం వివాదంలో ఉన్నందున.. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి అనుమతి ఇవ్వాలని కోరారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు.

## ఈరోజు

### నర్సారెడ్డి సంస్మరణ సభ

**నిర్మల్‌టౌన్:** పట్టణంలోని మారుతి ఇన్ హోటల్‌లో బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు మాజీ మంత్రి పి.నర్సారెడ్డి సంస్మరణ సభ పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. నర్సారెడ్డి అభిమానులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, పుర ప్రముఖులు హాజరు కావాలని కోరారు.

### చెక్కులు పంపిణీ

**ఖానాపూర్:** పట్టణంలోని రెవెన్యూ కార్యాలయ ఆవరణలో బుధవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే బొజ్జు పంపిణీ చేస్తారని తహసీల్దార్ శివరాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని లబ్ధిదారులు కార్యాలయం వద్దకు రావాలని సూచించారు.

### విద్యార్థులకు అభినందనలు

**ఖానాపూర్:** రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికైన మండలంలోని మస్కాపూర్ జెడ్పీఎస్ఎస్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి అన్వేశ్‌ను మంగళవారం పాఠశాలలో అభినందించినట్లు హెచ్ఎం నరేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

**లోకేశ్వరం:** మండలంలోని పిప్రి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన వేంపల్లి స్పందన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికైంది. జనవరి 11న ఆన్‌లైన్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థిని అభినందించినట్లు హెచ్ఎం అశోక్ తెలిపారు.

**సోన్:** మండలంలోని పాక్‌పట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి షేక్ అవేజ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎంకన్న ఓ ప్రకటనలో తెలిపారు. గైడ్ టీచర్ జువ్వల శ్రీధర్, ఉపాధ్యాయులు అభినందించారు.

# ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**తానూరు:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి నిర్వహించే ఇంటర్ వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సీఎస్ శ్రీనివాస్ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 95 మంది, ద్వితీయ సంవత్సరంలో 97మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు 30 నిమిషాలు ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

**లోకేశ్వరం:** ఇంటర్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ మోతీరాం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పరీక్షల కేంద్రాన్ని తహసీల్దార్ పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బంది కల్గకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సోలమాన్‌రాజ్, ఆర్ఐ బాలకిషన్, అధ్యాపకులు ఉన్నారు.



తానూరు: గదిలో పరిశీలిస్తున్న సీఎస్ శ్రీనివాస్

పరీక్ష కేంద్రం పరిశీలన

**దిలావర్‌పూర్:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్ బి.స్వాతి పరిశీలించారు. పరీక్షలను సజావుగా నిర్వహించాలని ఆమె సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ప్రిన్సిపాల్ శంకర్‌కు పలు సూచనలు చేశారు. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ శంకర్, డిపార్ట్‌మెంట్ అధికారి ఎం.లక్ష్మీకాంత్ మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 197 మంది విద్యార్థులు, ఒకేషనల్ విభాగంలో 26 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 209 మంది, ఒకేషనల్ విద్యార్థులు 27మంది పరీక్షలకు హాజరు కానున్నట్లు ఆయన వెల్లడించారు.

# అవిశ్వాసం వీగేనా..!

- బలనిరూపణకు సిద్ధమైన బీజేపీ ఎంపీటీసీలు
- నేడు నూతన ఎంపీపీ ఎన్నిక

**నిర్మల్:** సారంగపూర్ మండల ఎంపీపీ పదవిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. తనపై అవిశ్వాసం ప్రవేశపెడుతున్నారనే సమాచారంతో ఎంపీపీ మహిపాల్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో జెడ్పీ సీఈవో ఆదేశాల మేరకు మండల అధికారులు వైస్ ఎంపీపీ పతాని రాధకు ఇన్‌చార్జి ఎంపీపీ బాధ్యతలు అప్పగించారు. కాగా అవిశ్వాసంపై బుధవారం ఉదయం 11గంటలకు ఎంపీడీఓ లక్ష్మీకాంత్‌రావు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. గత సమావేశానికి ముందే ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన పతాని రాధ కోర్టును ఆశ్రయించి స్టే తీసుకురావడంతో బల నిరూపణ చేయకుండానే సమావేశం రద్దయింది. అనంతరం మండలంలోని మొత్తం 14 మంది ఎంపీటీసీ సభ్యుల్లోంచి తొమ్మిది మంది చేరారు. దీంతో బలం పెంచుకున్న బీజేపీ మళ్లీ బలనిరూపణకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

**క్యాంపులో తొమ్మిది మంది ఎంపీటీసీలు..**

బీజేపీకి చెందిన తొమ్మిది మంది ఎంపీటీసీ సభ్యులు తమ ఎంపీపీ అభ్యర్థికి మద్దతుగా క్యాంపునకు వెళ్లారు. దీంతో చేసేదేం లేక బీఆర్ఎస్ ఎంపీటీసీలు లోలోపల మంతనాలు ప్రారంభించారు. తమకు తెలిసిన వారితో క్యాంపులోని ఎంపీటీసీలను తమ వైపు తిప్పుకునే దిశగా పావులు కదిపారు. వారు చేసిన మంతనాలు సఫలమైతే నేటి మండల ప్రత్యేక సమావేశంలో అవిశ్వాసాన్ని ఎదుర్కొని నిలదొక్కుకోగలుగుతారు. లేకపోతే బీజేపీ ఎంపీటీసీలే అవిశ్వాసంలో నెగ్గే అవకాశం ఉంది. అదే జరిగితే మండల ఎంపీపీగా మలక్‌చించోలి ఎంపీటీసీ ఎగ్గం సరితను ఎన్నుకుంటారని సమాచారం.

## వైభవంగా రేణుకమాత కల్యాణం

**లక్ష్మణచాంద:** మండలంలోని వడ్యాల్ గ్రామంలో మంగళవారం శ్రీ రేణుకమాత కల్యాణం ఘనంగా నిర్వహించారు. మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో వార్షికోత్సవాలు నిర్వహిస్తున్న విషయం తెలిసి ందే. చివరిరోజు మంగళవారం అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి.. ఆలయ ఆవరణలో రేణుకమాత–జమదగ్ని ముని దంపతుల కల్యాణాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆవరణలో ఒగ్గు కళాకారులు రేణుక ఎల్లమ్మ జీవిత చరిత్రపై నాటిక ప్రదర్శించారు. అనంతరం మహా అన్నదానం చేశారు. వివిధ ప్రాంతాల భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. రేణుక ఎల్లమ్మను డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు దర్శించుకున్నారు. జిల్లా ప్రజలు సుభిక్షంగా ఉండాలని మొక్కుకున్నట్లు తెలిపారు. రాజేశ్వర్, ఈటెల శ్రీనివాస్, నరేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

### ముగిసిన మల్లన్న జాతర

**ముధోల్:** మండలంలోని ఎడ్‌బిడ్‌లో నాలుగు రోజులుగా కొనసాగుతున్న మల్లన్న జాతర ముగిసింది. చివరిరోజైన మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా ఆడపడుచులు ఒకరికొకరు గాజులను వాయినాలు గా ఇచ్చుకున్నారు. గ్రామ కమిటీ సభ్యులు, తదితరులు ఉన్నారు.

## ఆధ్యాత్మికం

### ఆలయ ప్రారంభోత్సవం



వేడుకల్లో బోనాలతో భక్తులు, పోతరాజుల విన్యాసం

**నిర్మల్‌టౌన్:** జిల్లా కేంద్రంలోని నాయుడువాడ కాలనీలో ఇటీవల నిర్మించిన మారెమ్మ ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం బోనాల జాతర నిర్వహించగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం డప్పుచప్పుళ్ల నడుమ మహిళలు బోనాలతో ఆలయానికి వెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

### అష్టభైరవ సహిత చండీహోమం

**ఖానాపూర్:** మండలంలోని మస్కాపూర్ గ్రామంలోని రాజరాజేశ్వర ఆలయంలో మంగళవారం అష్టభైరవ సహిత చండీహోమం ఘనంగా నిర్వహించారు. పండితులు సందీప్‌శర్మ బృందం ఆధ్వర్యంలో గణపతి పూజ, ధ్వజస్తంభ సంస్కారం, సామూహిక కుంకుమార్చన, మూల మంత్రహోమాలు, ఏకాశితి కలశస్నాపన, శయ్యాది వాసం, ఆదివాస హోమాలు, తదితర పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం విగ్రహ ప్రతిష్ఠాపన, మహాఅన్నదానం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. భక్తులు తరలిరావాలని కోరారు.



# పట్టుదల, ప్రణాళికతో చదవాలి

**కడెం:** పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలంటే భయం వీడి.. పట్టుదల, ప్రణాళికతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సెక్టోరియల్ అధికారి శ్రీదేవి అన్నారు. మంగళవారం కడెంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా పదో తరగతి విద్యార్థుల స్పెషల్ టెస్ట్‌కు సంబంధించిన జవాబు పత్రాలను పరిశీలించారు. అనంతరం సీఆర్టీలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది ఉన్నారు.

**దస్తురాబాద్:** ప్రశాంతంగా పరీక్ష రాసి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని సెక్టోరియల్ అధికారి శ్రీదేవి సూచించారు. మండల కేంద్రంలోని కేజీబీవీని సందర్శించి వార్షిక పరీక్షల నేపథ్యంలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం రికార్డులు, ఆహారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్‌వో తిరుమల, ఉపాధ్యాయులు సులోచన, రాధ, రమ్య, శ్వేత తదితరులు ఉన్నారు.



కడెంలో మాట్లాడుతున్న అధికారి శ్రీదేవి

## 'ఆదివాసీలకే ఎంపీ టికెట్ కేటాయించాలి'

**కడెం:** ఆదిలాబాద్ ఎంపీ టికెట్‌ను బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఆదివాసీ ఉద్యమకారులకే కేటాయించాలని ఆదివాసీ జేఏసీ ఉమ్మడి జిల్లా వైస్ చైర్మన్ ఆత్రం రవీందర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వెనుకబడి ఉన్న ఆదివాసీలకు రాజకీయాల్లో అవకాశం కల్పించాలని.. పార్లమెంట్ ఎన్నికల్లో ఆదివాసీ నాయకుడికే తమ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. అంబేద్కర్ సంఘ నాయకులు ఆర్ల రమేశ్ తదితరులు ఉన్నారు.

## 'కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'

**భైంసాటౌన్:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పెద్దపల్లి ఇన్‌చార్జి, ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ అన్నారు. విజయ సంకల్పయాత్రలో భాగంగా హైదరాబాద్‌లోని కార్వాన్ నియోజకవర్గంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడోసారి అధికారమే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. వారి వెంట ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, నాయకులు ఉన్నారు.



యాత్రలో ఎమ్మెల్యే రామారావుపటేల్

### దీక్ష స్వీకరణ

**దస్తురాబాద్:** మండల కేంద్రంలోని శివాలయంలో మంగళవారం 13 మంది భక్తులు శివదీక్షలు స్వీకరించినట్లు అర్చకులు రాజేశ్ తెలిపారు. ఆలయంలో 11రోజుల పాటు ఉదయం, సాయంత్రం రుద్రాభిషేకం, హారతి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వారు పేర్కొన్నారు.

# సకాలంలో పన్నులు చెల్లించాలి

- మున్సిపల్ కమిషనర్ మనోహర్



మాట్లాడుతున్న మనోహర్

**ఖానాపూర్:** పట్టణ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఆస్తిపన్నులను ప్రజలు సకాలంలో చెల్లించాలని కమిషనర్ టి.మనోహర్ కోరారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.59లక్షల పన్నులు బకాయిగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలు పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. అంతకుముందు పట్టణంలోని పలు కాలనీల్లో మున్సిపల్ సిబ్బంది ఇంటింటా తిరుగుతూ పన్నులు వసూలు చేశారు.



పన్నులు వసూలు చేస్తున్న సిబ్బంది

### బహుమతులు అందజేత

**ఖానాపూర్:** వివేకానంద స్వామి, సుభాశ్‌చంద్రబోస్ జయంతి పురస్కరించుకుని ఏబీవీపీ ఆధ్వర్యంలో యువజనోత్సవాలు నిర్వహించగా మంగళవారం పట్టణంలోని ఏఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో ముగింపు సభ ఏర్పాటు చేశారు. దీనికి ఎస్సై లింబాద్రి హాజరై మాట్లాడారు. ఆటలపోటీల్లో గెలుపోటములు సహజమని.. పోరాటం చేసి క్రీడాస్ఫూర్తి చాటాల ని సూచించారు. అనంతరం క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, క్విజ్, ఖోఖో, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి మెమొంటోలు అందజేశారు. పడాల ప్రభాకర్, చంద్రగిరి శివ, అరుణ్, దుర్గప్రసాద్, లక్ష్మీకాంత్, సాయి, తదితరులున్నారు.

# భైంసా మున్సిపల్ డీఈఈ, ఏఈ బదిలీ

**భైంసాటౌన్:** భైంసా మున్సిపల్ డీఈఈ నాగేశ్వర్‌రావు, ఏఈ యాకుబ్ అలీ బదిలీ అయ్యారు. ఈమేరకు వారిని బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో వైస్‌చైర్మన్ ఎండీ జాబీర్ అహ్మద్, కమిషనర్ వెంకటేశ్వర్లు, అధికారులు, సిబ్బంది వారిని శాలువా, పూలమాలలతో సత్కరించి వీడ్కోలు పలికారు. నూతన డీఈఈగా సుదర్శన్‌రెడ్డి బోధన్ నుంచి బదిలీపై రానున్నారు. జగిత్యాల నుంచి బదిలీపై వచ్చే వాజిద్ ఏఈగా బాధ్యతలు చేపట్టనున్నారు.




డీఈఈ, ఏఈలను సన్మానిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్లు, ఉద్యోగులు

### సైన్స్ వారోత్సవాలు

**లక్ష్మణచాంద:** జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని కనకాపూర్ అక్షర హైస్కూల్‌లో సైన్స్ వారోత్సవాలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ నవీన్‌రెడ్డి తెలిపారు. మంగళవా రం విద్యార్థులు వాయు, నీటి కా లుష్యాన్ని తగ్గించి పర్యావరణం కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలను ప్రయోగాల ద్వారా వివరించారు. కరస్పాండెంట్ నరేశ్‌రెడ్డి, రాజారెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు అశోక్, చాణక్య, విజయ్ పాల్గొన్నారు.



పాఠశాలలో ప్రదర్శిస్తున్న విద్యార్థులు